# యూరప్ రైతుల నిరసనోద్యమాలు

**2023,** నవంబర్‌లో ఫ్రాన్స్‌లోని టులూస్ పట్టణ ప్రభుత్వ పరిపాలనా కార్యాలయాల ఎదుట రైతులు లారీలతో వ్యవసాయ వ్యర్థాలను పడవేసి, పేడను స్ప్రే చేసి తమ నిరసనను తెలియ చేశారు. కొన్ని పట్టణాలలో జాతీయ పాలసీలు, యూరోపియన్ యూనియన్ వ్యవసాయ పాలసీలు తలక్రిందులుగా ఉన్నాయంటూ సైన్ బోర్డులను తలకిందులుగా చేశారు.

జర్మనీలో 2024 జనవరి నాటికి మూడో వారానికి చేరిన నిరవధిక నిరసనలలో రైతులు తమ దేశ పార్లమెంటుకు దగ్గరలోని బ్రాండెన్బర్గ్ గేటు వద్ద ఇదేవిధంగా పెంటపోగు వేసి నిరసన తెలిపారు.

నత్రజని ఉద్గారాలు తగ్గించే పేరుతో రైతులు తమ వ్యవసాయ కమతాల విస్తీర్ణాలను, పాడి పశువులను తగ్గించుకోవాలనే పాలసీలకు వ్యతిరేకంగా 2019లో నెదర్లాండ్స్‌లో ఎగసిన రైతు ఉద్యమాలు–2023 నాటికి ప్రభుత్వాన్నే మార్చేశాయి. పోలండ్, రుమేనియా, బల్గేరియా దేశాలలో యూరోపియన్ యూనియన్ పాలసీ వల్ల ఉక్రెయిన్ సరుకులు తమ వ్యవసాయ మార్కెట్లను కొల్లగొడుతున్నాయని నిరసనలు చేస్తూనే వున్నారు.

మరికొన్ని పట్టణాలలో తమ ఉత్పత్తులకు కనీస ధరలు ఇవ్వడం లేదంటూ పేడ, ఇతర ఎరువులను సూపర్ మార్కెట్ల ముందు పడేసి నిరసించారు. ధరల నిర్ణయాన్ని బడా మార్కెట్ల దయకు వదిలి వేసిన దాని పర్యవసానమే ఇది. (మన దేశంలో కూడా NDA ప్రభుత్వం నాడు చట్టబద్ధంగా, నేడు దొడ్డిదారిలో అమలుచేస్తున్న వ్యవసాయ నల్ల చట్టాలు, మార్కెట్‌శక్తుల చేతుల్లో ధరల నిర్ణయాన్ని శాశ్వతం చేశాయి.) గత సంవత్సరం ఫ్రాన్స్‌లో రైతాంగ ఆత్మహత్యలకు నిరసనగా పార్లమెంట్ ఎదురుగా వున్న చెట్లకు బొమ్మలను వేలాడదీశారు.

ఈ విధంగా అనేక దేశాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల న్నింటిలో వేలాది మంది రైతులు వేల ట్రాక్టర్లతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భారత్, అర్జెంటీనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల ద్వారా స్థానిక వ్యవసాయరంగానికి వ్యతిరేకమైన పాలసీలు అమలవుతుంటాయి. ఈ విధానాలతో నష్టపోతున్న రైతులు తరచుగా చేసే నిరసన కార్యక్రమాలు, గత కొన్నేళ్లుగా ఐరోపా దేశాల్లో జరుగుతున్నాయి. ఎందుకంటే అక్కడ సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థల పాత్రను యూరోపియన్ యూనియన్ తీసుకున్నది. అక్కడ ప్రజల్లో క్రమంగా పెరుగుతున్న పెట్టుబడిదారీ దోపిడీ వ్యతిరేకత జాతీయవాదంగా ముందుకు వస్తోంది.

సామ్రాజ్యవాదం దీన్ని కూడా తన కనుకూలంగా, అంతర్జాతీయ సిద్ధాంతమైన మార్క్సిజానికి వ్యతిరేకంగా తిరోగమన శక్తులను ఆర్గనైజ్ చేయడానికి ఉపయోగిస్తున్నది. అయినప్పటికీ యుకె నుండి స్పెయిన్ వరకు రైల్వేలు, పోస్టల్, టీచర్లు, ట్రక్కర్లు, విద్యార్థులు, రైతులు, దాదాపు అన్ని రంగాల కార్మికులు తమ జీవన విధ్వంసానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు.

అయితే ఈ నిరసనలను సామ్రాజ్యవాద అనుకూల తొత్తు మీడియా దాదాపుగా చూపించడం లేదు. ఫ్రాన్స్ రైతులు చేసిన పేడ నిరసనలు దాదాపు ఎవరికీ తెలియకపోవడం, వాటి గురించి సమాచారం ఇంటర్నెట్లో కూడా లభించకపోవడం ఆశ్చర్యం.కానీ, జనవరి 2వ తేదీన ఫ్రాన్స్‌లో జరిగిన నిరసన కార్యక్రమం సందర్భంగా ప్రమాదవశాత్తు ఒక రైతు చనిపోతే, ఆ వార్తలు ప్రచారం చేశారు. ఫేస్బుక్, ట్విట్టర్ లాంటి సామ్రాజ్యవాద అమెరికా సోషల్ మీడియాలు అరబ్ దేశాలలోని నిరసనలను గోరంతను కొండంతలుగా చూపాయి గాని, ఈ యూరప్ నిరసన వార్తలను దాదాపుగా కనుమరుగు చేయచూస్తున్నాయి.

యూరోపియన్ యూనియన్ గత కొన్నేళ్ళుగా వాతావరణం మీద ఎక్కువ మక్కువ చూపిస్తున్నది. గత కొన్నేళ్ళుగా సంభవిస్తున్న వాతావరణ విపత్తులే ఇందుకు కారణం. అన్ని ఖండాలలో కెల్లా అత్యధిక భూతాపం యూరప్‌లోనే సంభవించింది. స్పెయిన్‌లో ఓ జీవనది ఎండిపోయింది. అకాల వరదలు, అసాధారణ ఉష్ణోగ్రతలు, వీటికి మానవాళి సృష్టిస్తున్న వాతావరణ కాలుష్యమే కారణమని, అందుకే 2050 నాటికి భూతాపం పారిశ్రామిక విప్లవం నాటికన్నా ఒకటిన్నర డిగ్రీలకు మించి పెరగకుండా నెట్ జీరో ఎమిషన్స్ (నికరంగా ఉద్గారాలను తీసేయాలని) సాధించాలని ప్రచారం చేస్తున్నారు. సామ్రాజ్యవాదం మొసలి కన్నీరు కారుస్తూ మానవాళి మేలు గురించి మాట్లాడుతుందంటేనే దాని వెనుక ఎవరి లాభాలు దాగివున్నాయో, ఏ దేశాల పెట్టుబడుల ప్రవాహాలకు దారులు తెరుచుకుంటున్నాయో పసిగట్టాలి. ఏ నినాదాల వెనక ఏ ఉద్దేశాలు దాగివున్నాయో ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా అర్థం చేసుకోవాల్సి వుంది.

**వాతావరణం మెరుగుదల పేరుతో యూరోపియన్ యూనియన్ పాలసీలు – గ్రీన్ డీల్ :**

**1. నాలుగు శాతం బీడు భూమి :** ఇ.యు తమ సభ్య దేశాల పోటీని తట్టుకోవడానికి ప్రతియేటా (Common Agriculture Policy-CAP) ఉమ్మడి వ్యవసాయ పాలసీ ద్వారా తన బడ్జెట్లో 40% వ్యవసాయ సబ్సిడీలుగా ఇస్తుంది (భారతదేశ వ్యవసాయ సబ్సిడీలు అన్నీ కలిపినా 10% కూడా ఉండవు). ఇందుకుగాను కొంత భూమిని పునరుద్ధరణకై పంటలు వేయకుండా బీడుగా వదిలేయాలి. అయితే కోవిడ్ విపత్తు, ఉక్రెయిన్ యుద్ధంతో ఆహార కొరత రాకూడదని మొన్నటి వరకూ వెసులుబాటు ఇచ్చింది. సాగు భూమిలో నాలుగు శాతం ఖచ్చితంగా పక్కన పెట్టాలనే

విధానాన్ని గతంలోనే ఆదేశించింది. అయితే 11 దేశాలు ఈ వెసులుబాట్లు ఇంకా కొనసాగించాలని కోరుతున్నాయి.

**2. కృత్రిమ రసాయనాలు, తగ్గింపు/నివారణ :** దీని కోసం క్రిమిసంహారకాలు, పురుగు మందుల పైన ఫీజులు పెంచడం, సేంద్రియ వ్యవసాయం ఖచ్చితంగా చేయాలనడం.

**3. నెట్ జీరో ఎమిషన్స్, నత్రజని ఉద్గారాల తగ్గింపు :** కర్బన ఇంధనాలను తగ్గించే పేరుతో వ్యవసాయ వాహనాలకు, వాటి డీజిల్ పై ఇచ్చే పన్ను మినహాయింపులను ఎత్తివేయడం జరిగింది. ఈ రెండు మినహాయింపులు ఎత్తివేయడం వల్ల రైతులు ఏటా 10% నుండి 12% ఆదాయాన్ని కోల్పోతారు. వ్యవసాయం (పాడి పశువుల) 80% అమోనియా ఉద్గారాలకు కారణమని, వాటిని తగ్గించే పేరుతో పాడిని తగ్గించుకోవాలని, అవి మేసే భూముల విస్తీర్ణం తగ్గించుకోవాలని ఆంక్షలు విధించింది.

**4. ఉక్రెయిన్‌తో వ్యాపార సరళీకరణ :** వీటికి తోడు ఉక్రెయిన్‌తో సరళీకరణ ఒప్పందాలు, రష్యాపై ఆంక్షలు అమలులో వున్నాయి. యూరప్‌కు ఎరువులు అత్యధికంగా రష్యా నుండే ఎగుమతి అవుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాపై ఆంక్షలతో రైతులకు ఎరువుల ఖర్చులు కూడా పెరిగిపోయాయి. మొన్నటి దాకా దీనికి పరిష్కారం ప్రపంచీకరణ అన్నవారు, ఇప్పుడు స్వయం సమృద్ధి అని, మన ఎరువులు మనమే తయారు చేసుకోవాలని చెప్తున్నారు. స్వయం సమృద్ధి సాధించే వరకు వచ్చే నష్టాలన్నీ రైతులే భరించాలన్నమాట. పెట్టుబడిదారీ సంక్షోభం నుంచి తాము బయటపడడానికి ఏ విధమైన ఎత్తుగడలనైనా సామ్రాజ్యవాదులు ఉపయోగిస్తారు.

**యూరప్‌లో రైతుల పరిస్థితులు :**

జర్మనీలో దాదాపు పది లక్షల మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. గత పది సంవత్సరాలుగా వారి ఆదాయాలలో పెరుగుదల లేదు. వారి సగటు వేతనం 2,740 యూరోలు. కానీ సగటు జర్మన్ కార్మికుడి వేతనం 4,100 యూరోలుగా వుందని ప్రభుత్వాలే ప్రకటిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో వీరి వేతనాలు కొంతలో కొంత పెరిగాయనిపిస్తోంది. 86% పొలాలు 100 హెక్టార్ల కన్నా చిన్నవే. ఒకప్పుడు 9 లక్షల హెక్టార్ల పొలాలు సాగులో ఉంటే, అవే ఇప్పుడు 2 లక్షలా 50 వేలకు కుదించ బడ్డాయి. రోజుకి 10 హెక్టార్ల కమతాలు కనుమరుగుతున్నాయి. అంటే పెద్దల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయన్నమాట. భూమి వ్యవసాయేతర వినియోగంలోకి పరాయీకరణ చెందుతోందని అనుకోవచ్చు. రోజుకు సగటున వెయ్యి మంది వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో 10 ఏళ్లలో లక్ష కమతాలు కనుమరుగయ్యాయి. ఉన్నటువంటి 4 లక్షల రైతాంగంలో ఏటా 1500 మంది రైతులు దివాలా తీస్తున్నారు. ఓ పక్క పంట పండించాలి అంటే, పాలసీలు అడ్డు వస్తాయి. మరోపక్క చేసిన ఉత్పత్తిని అమ్మాలంటే సూపర్ మార్కెట్లు సరైన ధర ఇవ్వవు. యూరప్‌లో గత 25 ఏళ్లలో 53 లక్షల కమతాలు కనుమరుగయ్యాయి. అమెరికాలో ఏటా 30 బిలియన్ డాలర్లు వ్యవసాయ సబ్సిడీలను 150 కార్యక్రమాల ద్వారా ఇస్తున్నారు. అంటే అమెరికా రైతులు, ప్రధానంగా పెద్ద కమతాల రైతులు ఈ సబ్సిడీల వల్ల కొంత మెరుగ్గా వున్నారు.

**ఈయు లాబీలు :**

ఈ.యు వ్యవస్థలో ప్రధానంగా మూడు వర్గాల ప్రయోజనాలు ఇమిడి ఉంటాయి. ప్రజాప్రతినిధులు, పెట్టుబడిదారీ లాబీలు, పర్యావరణ లాబీలు. ఈ పర్యావరణ లాబీలు పేరుకి ప్రజల తరపున ఉన్నట్టు కనిపించినా వాటి ముఖ్యోద్దేశం పర్యావరణ రహిత టెక్నాలజీల వైపు పెట్టుబడులను మళ్ళించడం. అంటే మూడింట రెండు వర్గాలకు పెట్టుబడులే ధ్యేయం. అందుకనే యూరోపియన్ యూనియన్‌లో ప్రజా ప్రతినిధుల కన్నా ఈ అప్రజాస్వామిక లాబీల కొరకు జరిగే నిర్ణయాలదే పైచేయి అవుతుంది. వ్యవసాయ రంగం అత్యధిక కర్బన ఉద్గారాలు విడుదల చేసే రంగమే కాదు. తయారీరంగం లేదా ఇంధన రంగాలతో పోలిస్తే చాలా తక్కువ మాత్రమే. కానీ 'గ్రీన్ డీల్' వల్ల వ్యవసాయ రంగం మీదే ఎక్కువ వత్తిడి ఎందుకు పడిందంటే ఆ 53 బిలియన్ జర్మన్ ఆటో లాబీ, ఆ 41 బిలియన్‌ల ఫ్రెంచ్ న్యూక్లియర్ లాబీ, రక్షణ రంగ లాబీల ముందు ఈ వ్యవసాయ రంగపు లాబీ నిలువలేకపోయింది. ఇక్కడ ప్రజాప్రయోజనాలతో నిమిత్తం లేదు.

**రెండు ప్రశ్నలు :**

ఈ.యు పర్యావరణ పాలసీ రెండు ప్రశ్నలను లేవనెత్తింది.

1. ఏఏ రంగాల వారు కాలుష్యాన్ని తగ్గించుకోవాలి?
2. పెట్టుబడులు ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలి?

ఎన్నో రకాల హానికారక ఉద్గారాలు వున్నా ప్రధానంగా రెండు – $CO_2$, అమోనియా ఉద్గారాలను మాత్రమే నిలువరించాలని లాబీలన్నీ కలిసి నిర్ణయించాయి. దీనికి అన్ని ఉద్గారాలను నిలువరించే అర్థం వచ్చేలా పెట్టిన పేరే నెట్ జీరో ఎమిషన్స్, నత్రజని ఉద్గారాల తగ్గింపు. రవాణా రంగం ఎలాగూ బ్యాటరీ వాహనాల వైపు నడుస్తుంది కాబట్టి దానికి ఇబ్బంది లేదు. రేడియేషన్ గురించి మాటే రానివ్వలేదు. ఫ్రెంచ్ న్యూక్లియర్ లాబీ, బొగ్గుతో తయారయ్యే విద్యుత్తు ఎలాగూ యూరోప్‌లో పెద్దగా లేదు. దీని వల్ల ఎక్కువగా నష్టపోయేది వ్యవసాయ రంగమే. కేవలం నాలుగు కంపెనీలే 70 శాతం వ్యవసాయ రంగాన్ని శాసిస్తుంటే వాటి లాబీ ఊరుకొంటుందా? వారు ఒకపక్క ఈ నిర్ణయాలను బలంగా వ్యతిరేకిస్తూనే, మరోపక్క ఈ సాకుతో తమ కొత్త టెక్నాలజీ – జీఎం పంట విత్తనాలు సహజ సిద్ధమని, వాటిని ఆమోదించాలని ప్రయత్నిస్తున్నాయి. కానీ 53 బిలియన్ యూరోల జర్మన్ ఆటో లాబీ, 41 బిలియన్ యూరోల ఫ్రెంచ్ న్యూక్లియర్ లాబీ, మైనింగ్ లాబీ, రక్షణ రంగ లాబీల ముందు వ్యవసాయ లాబీ నిలువలేకపోయింది. ఇంకో ముఖ్యవిషయం ఏమిటంటే అతిపెద్ద పర్యావరణ వినాశకారి అయిన డిఫెన్స్ రంగానికి ఏ చర్చలలోనూ స్థానం లేదు.

ఎందుకంటే ఆ వివరాలన్నీ రహస్యం కనుక. అందుకే నాటి క్యోటో, నిన్నటి ప్యారిస్, నేటి ఢిల్లీ COP పర్యావరణ సదస్సులలో దాని గురించి చర్చే లేదు. అంటే అంతిమంగా ఈ పర్యావరణ భారం రైతులు మోయాలి. ఇదే అత్యంత అభివృద్ధి చెందిన దేశాలలోని పెట్టుబడిదారీ వర్గాల ఎత్తుగడ. ఈ ఎత్తుగడల గురించి తమకు ఏమీ తెలియదని, సమాజ హితమే తమ లక్ష్యమని చెప్పుకునే ఎన్జీవోల చిత్తశుద్ధి కూడా ఇక్కడ ప్రశ్నార్థకమే.

పెట్టుబడులకై ఈ.యు పాలసీ ఏంటంటే – రైతులకు వ్యవసాయానికి CAP ఇచ్చే 40% సబ్సిడీలను మళ్లించడం. అందులో భాగంగానే వ్యవసాయ వాహనాలు, వాటి డీజిల్ పై ఇచ్చే పన్ను మినహాయింపులను ఎత్తివేశారు. ఇలా ప్రతి సంవత్సరం 80 నుండి 140 బిలియన్లు దాకా పెట్టుబడులు సమకూర్చుకోనుంది ఈ.యు. ఇందులో భాగంగానే జర్మన్ ప్రభుత్వం కోవిడ్ కోసం చేసిన అప్పులో మిగిలిన 60 బిలియన్ డాలర్లను ఈ పెట్టుబడులకు మళ్లించ చూస్తే కోర్టు నిరాకరించింది. ఒకవేళ అటు మళ్లించి వుంటే ప్రజావసరాలకు వాడాల్సిన 60 బిలియన్లు గల్లంతైనట్టే. ఈ.యు బొగ్గును వదిలి కాలుష్య రహిత టెక్నాలజీకి మారడానికి 17.5 బిలియన్ల 'జస్ట్ ట్రాన్సిషన్ ఫండు'ను కేటాయించనుంది. అయితే దీనివల్ల ఎక్కువగా లాభపడేది ఈ.యులో అత్యంత ధనిక దేశమైన జర్మనీనే. ఎందుకంటే అక్కడే ఎక్కువ బొగ్గు పరిశ్రమలు వున్నాయి.

**వ్యవసాయం – పెట్టుబడి :**

హరిత విప్లవం పేరుతో వ్యవసాయంలోని అన్ని భాగాలు డబ్బుతో/ఖర్చుతో ముడి వేయబడ్డాయి. ఎరువులు, క్రిమి సంహారకాలు, విత్తనాలు అన్నీ ప్రతి పంటకూ కొనుక్కోవాల్సిందే. యూరోప్‌లో అయితే యాంత్రీకరణ కూడా ఎక్కువే. అందుకే అన్ని రంగాల్లోకి వ్యవసాయం అత్యంత పెట్టుబడి అవసరమయ్యేదిగా పరిణమించింది. వ్యవసాయంలో మనిషికి 7,94,300 యూరోల పెట్టుబడి కావాలి (ఇది కూడా భూమిని మినహాయించి). ఇదే పరిశ్రమల రంగంలో 4,11,000 యూరోలు, వాణిజ్య రంగంలో 1,93,300 యూరోలు, నిర్మాణ రంగంలో 59,500 యూరోలు.

నిన్న మొన్నటి వరకు హరిత విప్లవాన్ని ఆకాశానికి ఎత్తేసి, సాగు విస్తీర్ణం పెంచుకోవాలని చెప్పిన ప్రభుత్వాలు, రైతులు పెట్టుబడులు పెట్టాక ఇప్పుడు (హరిత విప్లవం పేరు ఎత్తకుండానే) ఆ పద్ధతులు పర్యావరణానికి నష్టదాయకాలని, వాటిని వదిలి తిరిగి సేంద్రీయ వ్యవసాయం చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. సేంద్రీయ వ్యవసాయం ఎంతో శ్రమతో కూడుకున్నది. మానవ శ్రమ, ఇతర జీవజాతుల మనుగడతో కూడా ముడిపడిన అంశం. వ్యవసాయంలో వున్న ప్రతి విడి అంశాన్ని తమ పారిశ్రామిక పెట్టుబడి అవసరాలకు మళ్ళించుకున్నారు. ఆయా రంగాలన్నింటిలో అసాధారణ యాంత్రీకరణను పెంచారు. క్రమంగా అత్యధిక భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి కనుక వారు అదనపు విలువను మిషన్ల ద్వారా పొందలేరు. కనుక సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రచారంలోకి తెస్తున్నారు. ఈ రకమైన ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే ఆరోగ్యాల గురించి, పర్యావరణ పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ పేరుతో శ్రమ దోపిడీని తీవ్రతరం చేయడం, ఈ ఉత్పత్తులను మార్కెట్లో అధిక లాభాలకు అమ్ముకోవడం, తద్వారా ఇంకా ఎక్కువ అదనపు విలువను పొంది, దాన్ని పెట్టుబడిగా మార్చుకోవడం అన్నవి వారి అప్రకటిత లక్ష్యాలు.

యూరప్‌లో జరుగుతున్న రైతుల ఆందోళనలు, వాటికి కారణమైన ఈయూ వ్యవసాయిక విధానాలు అనేక లోతైన కోణాలను మన ముందుంచుతున్నాయి. ఆసియాలోని, ఇతర ప్రపంచ దేశాలలోని రైతులు తమపై రానున్న ఒత్తిడుల గురించి పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవాలి. ఏ విధంగా తమ తమ దేశాలలో వ్యవసాయాన్ని రక్షించుకోవాలి, అందుకోసం పాలకులతో, దోపిడీ వర్గాలతో ఎలా సంఘర్షణ పడాలో తేల్చుకోవాల్సి వుంది.

**(2024 ఏప్రిల్ 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)**

*****